# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 25 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 53

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## తెలంగాణలో ఈ నెల 30 వరకు భారీ వర్ష సూచన

హైదరాబాద్: అల్ప పీడనాల ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 30వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం 12 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది.. గురువారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది ఈనెల 26 నాటికి వాయుగుండంగా మారనుందని వాతావరణకేంద్రం వెల్లడించింది. తదుపరి ఈ వాయుగుండం దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో ఈనెల 27న తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం భారి నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.ఇవాళ మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.



# మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణం


2లో..

**రూ 525.36 కోట్ల వ్యయంతో పనులు**

**ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి**

మారిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వస్తున్న ఆకస్మిక వర్షాలు, క్లౌడ్ బస్ట్ లతో ప్రభుత్వ మౌలిక వసతులకు కూడా తీవ్ర నష్టం జరుగుతున్నది. పనులకు వెళ్ళిన వారు, ఇంటికి వచ్చి సామాన్లు, నిత్యావసరాలు సర్దుకునే వెసులుబాటు- లభించదు. దీనితో వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి, కట్టు- బట్టలతో రోడ్డున పడుతున్నాయి.


2లో..

## ఉరి తీస్తున్నారంటేనే అత్యవసర కేసు

**మిగతావేవీ అత్యవసరంగా పరిగణించం**

**సుప్రీం కోర్టు స్పష్టీకరణ**


2లో..

## బిజెపి క్రమంగా బలపడుతోంది

**అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం**

**జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ మనదే విజయం**

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**


2లో..

## గ్రూప్-1 విజేతలకు ఊరట

**పునఃమూల్యాంకన ఆదేశాలపై స్టే**

**సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేసిన ధర్మాసనం**

**అక్టోబర్ 16కు విచారణ వాయిదా**

## బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు ముగింపు


2లో..

బిహార్ ప్రజలు బీజేపీ రెలిజియస్ పోలరైజేషన్‌పై ఏమాత్రం ఆసక్తిగా లేరని, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజకీయాలను కోరుకుంటున్నారని చెప్పారు.

**అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్న ప్రజలు**

**నితీశ్ కుమార్‌ను భారంగా భావిస్తున్న బిజెపి**

**ఎన్‌డిఎలో తారాస్థాయికి అంతర్గత కలహాలు**

**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఖర్గే**

# గిన్నిస్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఈవెంట్ వాయిదా

**వర్షాల హెచ్చరిక నేపథ్యం**

**గిన్నిస్ బతుకమ్మ వేదిక సరూర్‌నగర్‌కు మార్పు**

హైదరాబాద్: బతుకమ్మ ఉత్సవాలను ఎల్‌బి స్టేడియం నుంచి సరూర్‌నగర్ స్టేడియానికి మార్చారు. ఈనెల 28 న ఎల్.బీ. స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన గిన్నిస్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఈవెంట్ ను 29 వ తేదీకి వాయిదా వేసినట్లు- రాష్ట్ర పర్యాటక శాఖ తెలియచేసింది. ఈ వరల్డ్ బుక్ రికార్డ్ బతుకమ్మ ఉత్సవాన్ని ఎల్.బీ. స్టేడియంలో కాకుండా సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు- తెలిపింది. సరూర్ నగర్ లో సెప్టెంబర్ 29 న నిర్వహించే అతిపెద్ద బతుకమ్మ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరవుతారని తెలిపింది. వరసగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో ఎల్.బి స్టేడియం నుండి సరూర్ నగర్ స్టేడియంకు మార్చినట్లు- ఒక ప్రకటనలో పర్యాటక శాఖ తెలియచేసింది.



# కృష్ణా జలాలపై పరస్పర విరుద్ధం

**ఉత్తమ్, రేవంత్ మాటలకు పోలికేది**

**చెరో మాట మాట్లాడుతూ పోతే ఎలా**

**ఆల్మట్టి ఎత్తుపై ఎందుకు స్పందించరు**

**కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు**



హైదరాబాద్: కృష్ణా జలాల వాటపై సీఎం రేవంత్ రెడ్డి ఒక మాట, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరో మాట మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో పూట పూటకో మాట, ఘడియ ఘడియకో లెక్క ఉందన్నారు. 299 టీఎంసీ కృష్ణా జలాల్లో వాటా ఒప్పుకొని తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీనే. చారిత్రక తప్పిదం చేసింది మీరు, తెలంగాణ సాగు నీటి రంగం చరిత్రలో ద్రోహులు మీరు. సమ్మక్క సాగర్ పూర్తి చేసింది బీఆర్ఎస్, డబ్బా ప్రచారం చేసుకుంటున్నది కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు చెరిగారు. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. ఒకవైపు చంద్రబాబుకు భయ పడి బనకచర్లపై మౌనం వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఉందని ఆలమట్టి ఎత్తుపై మౌనం వహిస్తున్నారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే, పక్క రాష్ట్ర ప్రయోజనలే ఎక్కువా అన్నారు.కృష్ణా జలాల్లో వాటా విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మళ్లా పాత పాటే పాడిండు.

# గిగ్ వర్కర్లకు కెటిఆర్ భరోసా


2లో..

**గిగ్ వర్కర్లకు ద్రోహం చేసిన కాంగ్రెస్**

**ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు మోసం**

**వారి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం**

ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు.

వేగుచుక్క

## ఉరి తీస్తున్నారంటేనే అత్యవసర కేసు



**న్యూఢిల్లీ:** అత్యవసర విచారణకు సంబంధించి దాఖలు చేసిన ఓ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఎవరినైనా ఉరి తీస్తున్నారంటే తప్ప మరే కేసునూ అదేరోజున అత్యవసరంగా విచారించబోమని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయమూర్తులపై ఉండే ఒత్తిడి, పని గంటల గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించింది. తాము ఎన్ని గంటలు నిద్రపోతున్నామో తెలుసా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. బుధవారం ధర్మాసనం అత్యవసర జాబితా కోసం కేసులను పరిశీలిస్తున్న నేపథ్యంలో శోభా గుప్తా అనే న్యాయవాది ఓ పిటిషన్‌ను న్యాయస్థానానికి అందజేశారు. రాజస్థాన్‌లోని ఒక నివాసగృహాన్ని ఈరోజు వేలం వేయనున్నారని.. ఈ రోజు విచారణ జరపకపోతే ఇల్లు చేజారిపోతుందని పేర్కొన్నారు. అందువల్ల దానిపై అత్యవసర విచారణ జరపాలని సుప్రీంకోర్టును కోరారు. దీనిపై స్పందిస్తూ.. జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకరి స్వేచ్ఛ ప్రమాదంలో ఉంటే తప్ప తాము అత్యవసరంగా విచారణ చేపట్టబోమని స్పష్టంచేశారు. అనంతరం ఇల్లు వేలం నోటీసు ఎప్పుడు జారీ చేశారని జస్టిస్ సూర్యకాంత్ న్యాయవాదిని అడిగారు. గత వారం వేలం నోటీ-సు జారీ చేశారని.. బకాయి ఉన్న మొత్తంలో ఇప్పటికే సగం చెల్లించారని లాయర్ కోర్టుకు తెలియజేశారు. దీంతో శుక్రవారం ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చాలని న్యాయమూర్తి సూచించారు.

## బిజెపి క్రమంగా బలపడుతోంది



హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ క్రమంగా ఎదుగుతోందని, ఒకప్పుడు గ్రామాల్లో ఒకటి రెండు ఓట్లు వచ్చిన చోట ఇప్పుడు వందల సంఖ్యలో ఓట్లు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని గుర్తించారని, గెలుపు చూస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో వచ్చే అన్ని ఎన్నికలను గెలువడంతో పాటు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించబోతున్నామని భరోసా ఇచ్చారు. మోడీ పాలన, బిజెపి పనితీరు ఇందుకు నిదర్శనమని అన్నారు. రామచందర్ రావు అధ్యక్షతన బీజేపీ ఆఫీస్ బేరర్స్ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇందులో భాగంగా.. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ ఇచ్చారని కాంగ్రెస్, కేసీఆర్ తెచ్చారని బీఆర్ఎస్ చెబుతున్నాయని.. కానీ, పార్లమెంట్‌లో బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లే తెలంగాణ వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. గత పదేళ్లుగా పాలకులు మాటలతో మభ్యపెట్టారని, కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క డిక్లరేషన్ కూడా అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయని, గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయలేకపోతున్నాయని అన్నారు. అలాగే బీసీలను కాంగ్రెస్
మోసం చేసిందని, అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం తెచ్చిందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు ఇస్తుందని, జీఓ ఇస్తే తాము కూడా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. జీఎస్టీ వల్ల అన్ని వర్గాల ప్రజలకు లాభం చేకూరిందని, నిత్యావసరాలు తక్కువ ధరలకు దొరకడానికి మోడీయే కారణమని చెప్పారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ వంటి కేంద్ర పథకాలు తెలంగాణలో ప్రజలకు చేరడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి 12 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయని తెలిపారు. ఇంకా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లోటు- చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తుందని విమర్శించారు. ఎరువుల కొరత రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా లోపమేనని అన్నారు. ఆఫీస్ బేరర్లు హైదరాబాద్‌ను వదిలి గ్రామాలకు వెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్రం చేస్తున్న పనులను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలోని స్థానిక ఎన్నికలను ఆపొద్దని, వాటిలో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కిషన్ రెడ్డి నాయకత్వంలో వంద శాతం బీజేపీ గెలుస్తుందని తెలిపారు. రేవంత్ రెడ్డికి ఆట చేతగాక కిషన్ రెడ్డిపై మాట్లాడుతున్నారని విమర్శించారు.

## ప్రజారోగ్యం, విద్య ప్రభుత్వం వద్దే ఉండాలి

అమరావతి: ప్రజారోగ్యం, విద్య ప్రభుత్వం చేతిలో ఉంటేనే న్యాయం జరుగు తుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.. మండలిలో విపక్షనేత మాట్లాడుతూ..పీపీపీ మోడ్ లో పెట్టిన కళాశాలలు ఫెయిల్ అయ్యాయని.. ప్రభుత్వం ఆధ్వర్యంలో కళాశాలలకు ఉండే బాధ్యత ప్రైవేటీకరణ జరిగితే ఉండదన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేస్తే చరిత్రహీనులుగా మిగులుతామని ఫైర్ అయ్యారు. తాము ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం కాదని.. కానీ విద్య, వైద్యం ప్రైవేట్ విధానానికి వ్యతిరేకమన్నారు.. వీటితో వ్యాపారం చేయాలని ఎవరైనా చూసినా వదిలి పెట్టమన్నారు. తాము ప్రజల మద్దతుతో అధికారంలోకి వస్తామని.. అప్పుడు వాళ్ళ సంగతి చూస్తామన్నారు.. కరోనా లాంటి విపత్తులు సంభవిస్తే స్పెషాలిటీ- ఆస్పత్రుల అవసరం ఉంటుందని.. ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు.. వైద్యాన్ని, చదువును డబ్బులతో సభ్యులు కొలవటం సరికాదన్నారు.. ఏ ప్రైవేట్ సంస్థ అయినా స్వతంత్ర సంస్థ కాదని.. వాళ్ళు ప్రజలకు సేవ చేయటం కోసం పనిచేయరని స్పష్టం చేశారు. చంద్రబాబు ఎప్పుడూ ముఖ్యమంత్రి అయినా ఎంతసేపు ప్రైవేట్ ప్రైవేట్ అంటారని.. ఆయన మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇలాగే చేస్తున్నారన్నారు.. విద్యా, వైద్యం కమర్షియల్ కాదు.. గత ప్రభుత్వ హయాంలో జగన్ తీసుకువచ్చారని మేం మద్దతుగా మాట్లాడటం లేదన్నారు.. మంచి ఎవరు చేసిన మంచి అనాలి.. అందుకే ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు గుర్తుంచుకుంటున్నామని చెప్పారు.. పీపీపీ అంటే వాళ్లకు అద్దెకు ఇవ్వటమే అని మీరే చెప్పారు.. అద్దె ఇంట్లో ఉన్నవాడు ఇల్లు ఎలా చూసుకుంటాడు.. వాళ్లకు బాధ్యత ఉంటుందా..? పోర్టులు కూడా ప్రైవేటీకరణకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ముడిపెడితే ఎలా..? సంక్షేమం ప్రభుత్వ బాధ్యతా? ప్రభుత్వం బేషజాలకు పోకుండా పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నాం.. మీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తున్నాం.. మేం ఎప్పుడు మొదలు పెట్టాం.. కోవిడ్ సమయంలో ఎవరైనా బయటకు
వచ్చారా..? మీ నాయకుడు కోవిడ్ సమయంలో హైదరాబాద్ నుంచి బయటకు వచ్చారా..? పూర్తిస్థాయిలో పనులు జరగాలనే కొంత సమయం పడుతుంది కదా? మీరు చేయాల్సిన పనులు ఆపి మాపై నిందలు వేస్తున్నారు.. ఇప్పుడు పెట్టే ఖర్చు ఎవరి జేబులోంచి ఇవ్వటం లేదు. నాబార్డు నిధులు వాడుకోవచ్చు.. మాట్లాడితే పులివెందుల కళాశాలకు ఖర్చు పెట్టారు అంటారు.. అది రాష్ట్రంలో లేరా.. మేం అధికారంలో ఉన్నప్పుడు కుప్పం మున్సిపాలిటీ- మేమే చేశాం.. ప్రజారోగ్యాన్ని ప్రైవేటు- తాకట్టు- పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.. అని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.

# గ్రూప్-1 విజేతలకు ఊరట



హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఈ అంశంలో టీజీపీఎస్సీకి హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. గ్రూప్-1 నియామకాలు చేపట్టుకోవచ్చని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చేనెల 16కి వాయిదా వేసింది.గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించింది. మెయిన్స్ జవాబు పత్రాలను 8 నెలల్లో పునఃమూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. మెయిన్స్ పత్రాలను పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 8 నెలల్లోపు చేయకపోతే మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. 2011లో గ్రూప్-1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీంకోర్టు రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టుకు ఏజీ తెలిపారు. దీనిపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ స్పందిస్తూ మాల్ ప్రాక్టీస్, పేపర్ లీక్‌లాంటి ఘటనలు ఏమైనా చోటు- చేసుకున్నాయా? పక్షపాతం చూపించారనడానికి ఏమైనా ఆధారాలున్నాయా?అని ఏజీని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఏపీలో నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో తెలుగులో రాసిన అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారని చెప్పారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పురుషులకు వాష్‌రూమ్‌లు లేవని.. అందుకే ఆ రెండు కేంద్రాల్లో మహిళలకు మాత్రమే కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు సమీపంలోని కేంద్రాలు కేటాయించామన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు- జారీ చేయడాన్ని సైతం తప్పుబట్టారని ఏజీ తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో టీజీపీఎస్సీకి అధికారం ఉంటుందని.. పరీక్ష కేంద్రాల కేటాయింపును తప్పుబట్టలేమని సీజే అన్నారు. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ డివిజన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే

నియామకాలు ఉంటాయని సీజే జస్టిస్ ఏకే సింగ్ స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ స్టే విధించడంతో గ్రూప్-1 ర్యాంకర్లకు ఊరట లభించింది. ఈ తీర్పుతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# అమరావతిపై వైకాపా కుట్రలు



అమరావతి:అమరావతిలో వైకాపా కుట్రల వల్ల జరిగిన విధ్వంసాన్ని సరిచేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గతంలో పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లు ఇప్పుడు ముందుకు రాలేదని, అందుకే మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చిందన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శాసనసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతిలో సీఆర్డీఏ నుంచి 21 పనులు, ఏడీసీ నుంచి 64 పనులు జరుగుతున్నట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం రాజధానిని నిర్వీర్యం చేసి మూడు ముక్కలాట ఆడిందని.. దీంతో అమరావతిలో అడవిలా పెరిగిన చెట్లను తొలగించేందుకు రూ.30 కోట్లు- ఖర్చు పెట్టాల్సి వచ్చిందన్నారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జీల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మార్చి 31 నాటికి 3,500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. 2019కి ముందు పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు
ప్రశ్నించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్ల విషయంలో తేడా ఎందుకు చూపుతోందని అడిగారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపును పరిశీలిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.హడ్కో, ప్రపంచ బ్యాంకు ద్వారా రాజధాని నిర్మాణానికి రుణాలు తీసుకున్నాం. పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయ్యాక ప్రధానిని పిలిచి ప్రారంభోత్సవం చేస్తాం. ఆమదాలవలసలో అమృత్-2లో భాగంగా అక్రమాలు జరిగింది నిజమే. కట్ట నిర్మాణ పనులతో పాటు- మరికొన్నింటి విషయంలో నిధుల దుర్వినియోగం జరిగింది. కమిటీ- నివేదిక వచ్చింది.. దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని నారాయణ తెలిపారు. ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జిల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాలు నిర్మాణం జరుగుతుందన్నారు. గత రెండు నెలలుగా వర్షాల వల్ల అమరావతి నిర్మాణ పనులకు ఆటంకం కలిగిందని తెలిపారు. ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు అమరావతి పనుల్లో పాల్గొంటున్నారని.. మార్చి 31 నాటికి 3500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. జాతీయ,అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం చేయాలనే ఉద్దేశంతో టెండర్ నిబంధనలు పెట్టామని మంత్రి నారాయణ వెల్లడించారు.విశాఖ మౌలిక సదుపాయాలకు సంబంధించి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయ సమాధానం ఇచ్చారు. జీవీఎంసీని నియోజకవర్గాల ప్రాతిపదికన 10 జోన్‌లుగా విభజించామని... త్వరలోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. జోనల్ కమిషనర్‌లకు అధికారాలపై పరిశీలన చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. విశాఖలో రూ.665 కోట్లతో సీవరేజి ప్రాజెక్ట్‌కు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. జీవీఎంసీ పరిధిలో తాగునీటి కోసం కొత్తగా ప్రాజెక్ట్ అమలు చేయనన్నామని తెలిపారు. విశాఖపట్నంలో డ్రెయిన్లు 4863 కి.మీ మేర అవసరం ఉండగా 3583 కిమీ మేర ఉన్నాయని.. మరో 193 కిమీ మేర డ్రెయిన్ల పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. విశాఖలో రోడ్లు వెడల్పు చేసిన చోట వివిధ కారణాలతో టీ-డీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సింహాచలం టీడీఆర్ బాండ్లపై దేవాదాయ శాఖ అధికారులతో చర్చిస్తున్నామన్నారు.

తణుకు టీడీఆర్ బాండ్ల వివాదం తర్వాత ఇతర కార్పొరేషన్‌లలో బాండ్ల జారీ ఆలస్యం అయిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# గిగ్ వర్కర్లకు ద్రోహం చేసిన కాంగ్రెస్



హైదరాబాద్: గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు- గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు-, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు- మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని విమర్శించారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు.గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తే బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీ-ఆర్ తెలిపారు

## పింఛన్‌దారులకు అలర్ట్..

**ఆంధ్రప్రదేశ్:** అక్టోబర్ నెల పింఛన్లకు సంబంధించి పింఛన్‌దారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకం కింద దివ్యాంగులు, వృద్ధులు. వితంతువులకు ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే దివ్యాంగ పింఛన్లలో అనర్హులు ఎక్కువమంది ఉన్నారనే అనుమానంతో ప్రభుత్వం ఇటీవల వైకల్య నిర్ధరణ పరీక్షలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా సదరం ప్రత్యేక శిబిరాలు నిర్వహించిన ఏపీ ప్రభుత్వం.. దివ్యాంగుల వైకల్య శాతాన్ని పరిశీలించింది. వైద్యులు ఇచ్చిన నివేదికల ఆధారంగా దివ్యాంగ పింఛన్లలోని కొంతమంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసింది ఏపీ ప్రభుత్వం. వైకల్య శాతం 40 కంటే తక్కువగా ఉన్నట్లు తేలిన వారికి నోటీసులు అందించారు. దీంతో దివ్యాంగ పింఛన్లు పొందేవారిలో ఆందోళన వ్యక్తమైంది. వైకల్యం ఉన్నప్పటికీ తక్కువ శాతం చూపుతున్నారంటూ ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించిన ఏపీ ప్రభుత్వం.. నోటీసులు అందుకున్నవారిలో 90 శాతానికి పైగా అప్పీలు చేసుకోవటంతో నోటీసులు

అందించిన వారందరికీ కూడా సెప్టెంబర్ నెలలో పింఛన్లు అందించాలని నిర్ణయించింది. ఆ మేరకు నోటీసులు అందుకున్న లబ్ధిదారులకు కూడా సెప్టెంబర్ నెలలో పింఛన్లు అందించారు.

ఇక దివ్యాంగ పింఛన్ల జాబితాలో ఉంటూ నోటీసులు అందుకున్న వారిలో ఎవరైనా వృద్ధులు, వితంతువుల కేటగిరీలోకి వచ్చే వారుంటే.. అలాంటి వారిని ఆయా పింఛన్ల రకంలోకి మార్చి పింఛన్ల ఇవ్వాలని కూడా నిర్ణయించారు. అలాంటి వారికి కూడా నోటీసులు ఇచ్చారు.


## బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు ముగింపు

పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బిహార్ ప్రజలు బీజేపీ రెలిజియస్ పోలరైజేషన్‌పై ఏమాత్రం ఆసక్తిగా లేరని, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజకీయాలను కోరుకుంటున్నారని చెప్పారు. బిహార్‌లోని ఎన్డీయేలో అంతర్గత కలహాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నా యని, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ఒక భారంగా బీజేపీ భావిస్తోందని అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఓట్ చోరీ అంశంపై బీజేపీని మరింత ఇరకాటంలో పెట్టే విషయమై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం బిహార్ రాజధాని పాట్నాలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయమైన సదాకత్ ఆశ్రమంలో బుధవారంనాడు నిర్వహించారు. ఖర్గే అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నేత రాహుల్ గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్‌పీ నేతలు హాజరయ్యారు. జాతీయంగా, అంతర్జాతీయంగా దేశం పెక్కు సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతోందని ఖర్గే ఈ సందర్భంగా అన్నారు. మోదీ, ఆయన ప్రభుత్వ దౌత్య వైఫల్యాల కారణంగానే అంతర్జాతీయంగా మనం సమస్యలను ఎదుర్కొంటున్నామని విమర్శించారు. మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంపే ఇప్పుడు ఇండియాను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఓటు చోరీ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకతపై ఆందోళనలు తలెత్తుతున్నాయని ఖర్గే అన్నారు. వివిధ రాష్ట్రాల్లో అవకతవకలను రాహుల్ లేవనెత్తుతుంటే వాటిని పరిష్కరించకుండా అఫిడవిట్లు సమర్పించాలని ఈసీ ఒత్తిడి తెస్తోందన్నారు. బిహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లను తొలగించేందుకు ప్రస్తుతం కుట్ర జరుగుతోందని ఖర్గే ఆరోపించారు. ఓట్ చోరీ అంటే రేషన్, పెన్షన్, మెడిసన్, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, పేదల హక్కులను దొంగిలించడమేనని అన్నారు.

## హిందూపూరంలో చేనేతలకు భరోసా

అమరావతి: హిందూపూరంలో చేనేతలకు ఉపాధితో పాటు ఆధునిక దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎస్సీడీపీ) మంజూరు చేసినట్లు- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ క్లస్టర్ తో 292 మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లో ఉన్న తన పేషీలో ఎమ్మెల్యే బాలకృష్ణతో కలిసి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎస్సీడీపీ) ఏర్పాటు-పై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ (ఎస్సీడీపీ) ఏర్పాటు-పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అంతకుముందు హిందూపురంలో ఎస్సీడీపీ ఏర్పాటు-, నేతన్నలకు శిక్షణ అందించే విషయమై ఫ్యాషన్ డిజైనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, రూ. 1.51 కోట్లతో ఏర్పాటు- చేస్తున్న ఎస్సీడీపీకి కేంద్రం రూ.1.44 కోట్లు-, లబ్ధిదారులు రూ.7.12 లక్షలు వాటాగా ఇవ్వనున్నారన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్.హెచ్.డి.పి) కింద కేంద్ర ప్రభుత్వం హిందూపురానికి ఎస్సీడీపీ మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నేతన్నలకు ఉపాధి లభించడంతో పాటు వారికి నేటితరం అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో శిక్షణ ఇవ్వనుమన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందిస్తూ, నూతన చేనేత దుస్తుల తయారీలో నిపుణులు, ఫ్యాషన్ డిజైనర్లతో నేతన్నలకు శిక్షణిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుత తరం ఆలోచనలు, ఫ్యాషన్ ను దృష్టిలో పెట్టు-కుని చేనేత దుస్తుల రూపకల్పనపై
నేతన్నలకు శిక్షణ ఇవ్వనున్నట్లు- వెల్లడించారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడానికి ఎస్సీడీపీ ఎంతో దోహదపడుతుందన్నారు. సిల్క్ శారీలో పట్టు- ఎంతో కీలకమని మంత్రి సవిత తెలిపారు. సిల్క్ శారీ తయారీలో అవసరమైన పట్టు- రాష్ట్రంలో ఉత్పత్తి కావడం లేదని, దీంతో బెంగుళూరు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో పట్టు- సాగు పెంచేలా చర్యలు తీసుకుంటు-న్నట్లు- వెల్లడించారు. ఇతర ఏ పంటల్లో లేనంత రాబడి పట్టు- సాగులో వస్తోందని, దీనిపై రైతుల్లో అవగాహన కల్పించనున్నామని తెలిపారు. పట్టు- ఉత్పత్తి పెంచి, తద్వారా సిల్క్ చీరల తయారీలో ఏపీ బ్రాండ్ పెంచేలా నిర్ణయించినట్లు- మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సెరీ కల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.చేనేత దుస్తుల తయారీలో నిపుణులు, ఫ్యాషన్ డిజైనర్లతో నేతన్నలకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుత తరం ఆలోచనలు, ఫ్యాషన్‌ను దృష్టిలో పెట్టుకుని చేనేత దుస్తుల రూపకల్పనపై శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడానికి ఇది ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. హిందూపురంలో చేనేత కార్మికులకు ఉపాధితో పాటు ఆధునిక దుస్తుల తయారీలో శిక్షణ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వ స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ మంజూరు అయ్యిందని తెలిపారు. ఈ క్లస్టర్ ద్వారా 292 మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు.

## మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణం



ఖమ్మం: ఖమ్మం నగర ప్రజల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ 525.36 కోట్ల వ్యయంతో మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణలో విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెటింగ్, వర్తక, వ్యాపార రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఖమ్మం అగ్రగామిగా నిలుస్తుంది. అయితే ఖమ్మం నగరం మధ్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగు ప్రతి ఏటా వర్షాకాలంలో ఉధృతంగా పొంగి, పరిసర ప్రాంతాల ఇండ్లు, వర్తక , వ్యాపార సంస్థలు, పంటలు వరద ముంపునకు గురవుతున్నాయి. మారిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వస్తున్న ఆకస్మిక వర్షాలు, క్లౌడ్ బస్ట్ లతో ప్రభుత్వ మౌళిక వసతులకు కూడా తీవ్ర నష్టం జరుగుతున్నది. పనులకు వెళ్ళిన వారు, ఇంటికి వచ్చి సామాన్లు, నిత్యావసరాలు సర్దుకునే వెసులుబాటు- లభించదు. దీనితో వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి, కట్టు- బట్టలతో రోడ్డున పడుతున్నాయి. రోడ్లు ,విద్యుత్ స్తంబాలు, సబ్ స్టేషన్లు, పాఠశాల భవనాలు, తాగునీటి వసతు లు, పైపు లైన్లు , ఆరోగ్య కేంద్రాలు దెబ్బతింటు-న్నవి. రూరల్ మండలం లో పంటలు ముంపుకు గురవుతాయి. ఉదాహరణకు 2024 సెప్టెంబర్లో సంభవించిన క్లౌడ్ బస్ట్ తో మున్నేరుకు వచ్చిన ఆకస్మిక వరద ముంపుతో ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు రూ. 757 కోట్ల నష్టం జరిగినట్లు- అధికారులు అంచనా వేశారు.

వేగుచుక్క

# ఫిక్స్ డ్ డిపాజిట్ల పేరుతో భారీ మోసం.

**దాదాపు 120 మంది నుంచి సుమారు రూ.8 కోట్ల వరకు వసూలు.**

**ఇద్దరు నిందితుల అరెస్ట్, పరారీలో మరికొంత మంది.**

**వివరాలు వెల్లడించిన నిజామాబాద్ సిసిఎస్ ఏసిపి నాగేంద్ర చారి.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఫిక్స్ డ్ డిపాజిట్ల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర నిందితులు ఇద్దరిని నిజామాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 120 మంది నుంచి సుమారు రూ.8 కోట్ల వరకు వసూలు చేసిన వారి మోసాలకు పోలీసులు చెక్ పెట్టారు. నిజామాబాద్ సిసిఎస్ ఎసిపి నాగేంద్ర చారి బుధవారం సిసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ ను కేంద్రంగా చేసుకుని ముంబాయి, పుణే, ఢిల్లీ, గుజరాత్, హైదరాబాద్ లాంటి నగరాలకు చెందిన వ్యక్తులు తక్కువ సొమ్ముతో పెట్టుబడుల పేరిట మోసం చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందల్వాయి మండలంకు చెందిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నిజామాబాద్ నగరంలోని హష్మీ కాలనీకి చెందిన మోయిజ్ ఖాన్, సయ్యద్ హైమద్ హసన్, మౌల్వి వాజీద్ హుస్సేన్ ల మాటలు నమ్మి క్రిప్టో కరెన్సీ లో పెట్టుబడి పెట్టాలని అతని వద్ద లక్షల రూపాయలు వసూలు చేశారు. ముందు కరెన్సీ మార్పిడి, కన్ స్ట్రక్షన్ కంపెనీలలో పెట్టుబడులు అని బాండ్ లు రాసీవ్వడంతో దాదాపు 120 మంది నుంచి సుమారు రూ.8 కోట్ల వరకు వసూలు చేశారు. బాండ్ లు రాసీ ఇవ్వడంతో తొ పాటు తెలిసిన వారు గొలుసుకట్టు లాగా ఏర్పడి సంస్థను ఏర్పాటు చేయడంతో వారు నమ్మి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. సంవత్సరాలు గడుస్తున్న డబ్బులు ఇవ్వకుండా దాటవేయడంతో మోసపోయిన బాధితులు పోలీసులకు పిర్యాదు చేసినట్లు వివరించారు. తమ విచారణలో మల్టీ లెవల్ పేరిట జరుగుతున్న మోసాలు గుట్టు బయటపడిందని తెలిపారు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ లమని యాప్ దేవలప్ చేస్తున్నామని నమ్మించి మోసాలకు పాల్పడటమే కాకుండా, ఆర్థిక మోసాలకు పాల్పడిన నేరస్తులకు సంబంధించిన రూపాయలను డాలర్ ల రూపంలో మార్చినట్లు కూడా గుర్తించారు. నిజామాబాద్ నగరంలోని హష్మీ కాలనీకి చెందిన మోయిజ్ ఖాన్, సయ్యద్ హైమద్ హసన్ ను అరెస్ట్ చేసినట్లు, మిగిలిన వారు పరారీలో ఉన్నారని ఏసీపీ తెలిపారు. వారిని త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సీసీఎస్ సీఐ సురేష్, సీఐ రవిందర్ లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# పూలే స్పూర్తితో “వివక్షత లేని సమాజాన్ని” నిర్మిద్దాం.

**సత్యశోధక్ సమాజ్ ఆశయాల సాధనకు పాటుపడుదాం.**

**సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య పిలుపు.**




**వేగుచుక్క న్యూస్, సిరికొండ, సెప్టెంబర్ 24**

పూలే స్పూర్తితో “వివక్షత లేని సమాజాన్ని” నిర్మిద్దాం అని, సత్యశోధక్ సమాజ్ ఆశయాల సాధనకు పాటుపడుదాం అని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య పిలుపునిచ్చారు. సామాజిక విప్లవోద్యమ పితామహుడు, మహాత్మ జ్యోతిరావ్ పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సత్యశోధక్ పాఠశాలలో మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రి బాయి పూలే చిత్ర పటాలకు పూలవేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, విద్యనే సమాజ వికాసానికి మూలమని, విద్యతో విముక్తి, సమానత్వంతో సమాజ శక్తి అనే ధ్యేయంగా అందరికి విద్య అందించాలని పూలే కృషి చేశారని అన్నారు. జాతి వివక్షతను ప్రశ్నిస్తూ, సమానత్వం కోసం జీవితాంతం ప్రజలను చైతన్యం పరుస్తూ, సమాజ హితమే లక్ష్యంగా స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. పూలే స్పూర్తితో వివక్షత లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు.

**డిజిటల్ విజ్ఞానంతో పాటు విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉండాలి.**

మత, కుల, లింగ వివక్షత, ఆర్థిక అసమానతల పరిష్కారం విద్యతోనే సాధ్యమవుతుందని, పూలే చూపించిన మార్గం నేటి సమాజాన్ని ఆలోచింపజేస్తోందని నర్సయ్య అన్నారు. దేశ భవిష్యత్తుకు మూల స్థంబాలైన విద్యార్థులు, యువత డిజిటల్ మాధ్యమాల ద్వారా విజ్ఞానాన్ని పొందటంతో పాటు సామాజిక బాధ్యత పట్ల చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సామాజిక న్యాయం, మహిళ సాధికారత, వికసిత భారత నిర్మాణం వంటి అంశాల్లో యువత క్రియాశీలంగా ఉండాల్సిన అవసరం ఉందని నర్సయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# బతుకమ్మ ఆడిన సబ్ కలెక్టర్ కిరణ్మయి.

**- విద్య, పే అండ్ అకౌంట్స్, స్టేట్ అడిట్, ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఆధ్వర్యంలో వేడుకలు.**

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, సెప్టెంబర్ 24:**



బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మార్గదర్శకత్వంలో జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ పండుగలను నిర్వహించడం జరుగుతుంది. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ పండుగలో విద్య, పే అండ్ అకౌంట్స్, స్టేట్ అడిట్ మరియు ఇంటర్మీడియట్ విద్యాశాఖల ఉద్యోగులు పువ్వులతో ముస్తాబు చేసిన బతుకమ్మలతో సాంప్రదాయక దుస్తులతో హాజరై బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బతుకమ్మ ఆడి అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయంలో బతుకమ్మ పండుగకు విశిష్ట స్థానం ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్న ఈ బతుకమ్మ పండుగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాజు తో పాటు ఆయా శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు సన్మానించి న్యాయవాదులు.

**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**



జిల్లా ఎస్సీ, ఎస్టి కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఇటీవల నియమితులై బాధ్యత చేపట్టిన ఆర్. దయాకర్ గౌడ్ ను న్యాయవాది పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం శాలువాలు కప్పి పూల మొక్కలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ న్యాయవాదులు పడిగెల వెంకటేశ్వర్, ఎన్ఎస్ చౌదరి, వెంకటేష్, నారాయణ పాల్గొన్నారు.



వేగుచుక్క న్యూస్: హౌసింగ్ బోర్డ్ కాలనీ, కామారెడ్డిలో ఫైర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవం.

# భాష రాకున్నా భావాలతో సంభాషణ భళా.



**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.**

**ఘనంగా అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

భాష రాకున్నా భావాలతో సంభాషణ గొప్ప విషయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం సందర్భంగా డెఫ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిజామాబాదు వారు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీస్ యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, వ్యక్తుల మధ్య సంభాషణకు భాష అవసరం. అలాంటి భాషను వినా లేని, మాట్లాడలేని బధిరులకు సమాచారాన్ని అర్థమయ్యే రీతిలో అందించేందుకు ఆవిర్భవించిందే సంకేత భాష విధానం అన్నారు. బాడీ లాంగ్వేజ్, శరీర కదలికలు, కనుబొమ్మలను కదపడం, ముఖ కవళికల ద్వారా ఎదుటి వ్యక్తితో సంభాషణ చేసే నైపుణ్యాన్ని సంకేత భాష అందిస్తుందని, వేళ్లు లేదా చేతి సంజ్ఞల ద్వారా మనసులోని భావాలను వ్యక్తపరచడం గొప్ప విషయం అన్నారు. 2018 సెప్టెంబర్ 23న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మొదటిసారిగా అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని నిర్వహించిందని,

ఈ సంవత్సరం 2025 అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం యొక్క థీమ్ “సంజ్ఞా భాష హక్కులు లేకుండా మానవ హక్కులు లేవు” అన్నారు. సంజ్ఞా భాషను ఉపయోగించే వారి హక్కును గుర్తించకుండా మరియు మద్దతు ఇవ్వకుండా బధిరుల హక్కులను పూర్తిగా సాధించలేమని ఈ థీమ్ నొక్కి చెబుతుంది అన్నారు. బధిరుల సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వారు ఎమ్మెల్యేని కోరగా, స్థలం, నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సౌందర్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మీ నారాయణ, భూపతి పాల్గొన్నారు.




వేగుచుక్క న్యూస్ కామారెడ్డి: పట్టణంలోని ఆర్ కె డిగ్రీ కళాశాలలో బుధవారం పెద్ద ఎత్తున బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. మహిళా సిబ్బంది, విద్యార్థినులు సాంప్రదాయ ఆట పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ కె విద్యా సంస్థల సీఈఓ జైపాల్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రేమ పెళ్లిళ్లకు అడ్డాగా మేడ్చల్.

**ఈ ఏడాది 1102 ప్రేమపెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు నమోదు.**

**రెండు, మూడు స్థానంలో రంగారెడ్డి, వరంగల్ జిల్లాలు.**



**వేగుచుక్క న్యూస్:హైదరాబాద్**

మేడ్చల్ అంటే ఐటీ కంపెనీల కేంద్రం. విద్యాసంస్థల నిలయం. ఇప్పుడు తాజాగా బయటికొచ్చిన విషయం ఏంటంటే.. మేడ్చల్ ప్రేమ పెళ్లిళ్ల అడ్డాగానూ మారిపోయింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోల్చితే ఈ జిల్లాలోనే అత్యధిక ప్రేమ వివాహాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. తెలంగాణలో ఏటా నాలుగు వేలకు పైగా ప్రేమ వివాహాల రిజిస్ట్రేషన్లు నమోదవుతుండగా ఒక్క మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో వెయ్యికి పైగా ఉంటున్నాయి. వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు అనేక ప్రైవేట్ ఇన్స్టిట్యూట్లు, సాఫ్ట్వేర్ కంపెనీలు ఈ ప్రాంతంలో కొలువు దీరాయి. హాస్టళ్లు కూడా వేల సంఖ్యలో ఉన్నాయి. ఇంకేముంది మనసులు కలుస్తుండటంతో సప్తపది వేసేందుకు రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల గడప తొక్కుతున్నాయి ప్రేమ జంటలు. ఈ జిల్లాలో 2020-21 నుంచి 2024-25 మధ్యలో వరుసగా 984, 1149, 1196, 1168, 1102 ప్రేమపెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. తర్వాత స్థానంలో రంగారెడ్డి జిల్లా ఉంది. ఐదేళ్లలో వరుసగా 339, 446, 539, 661, 652 రిజిస్ట్రేషన్లు జరిగాయి. మూడో స్థానంలో వరంగల్ జిల్లా ఉండగా ఇక్కడ కూడా 412 నుంచి 647 మధ్య ప్రేమ వివాహాల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.



# రాష్ట్రంలో కొత్తగా మరో 4 ఐటీఐలు..



తెలంగాణ: ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఉచితంగా నాణ్యమైన, మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తోన్న ప్రభుత్వం ఆ దిశగా మరో అడుగు ముందుకు వేసింది. రాష్ట్రంలో మరో నాలుగు కొత్త ఐటీఐ (ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు) కాలేజీలను ఏర్పాటు చేయబోతుంది. రాష్ట్రంలోని నాలుగు వేర్వేరు నియోజకవర్గాల్లో ఈ 4 కొత్త ఐటీఐలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెడీ అయ్యింది. దీనిలో భాగంగా అచ్చంపేటలోని కొండారెడ్డి, శామీర్‌పేట శివారులోని జినోమ్ వ్యాలీ, ఖమ్మం జిల్లా మధిరలతో పాటుగా మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గాల్లో ఈ ఐటీఐలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

నాలుగు ఐటీఐ కాలేజీల ఏర్పాటుకు సంబంధించి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు రెడీ చేసి ప్రభుత్వానికి అందించారు. రానున్న మంత్రివర్గ సమావేశంలో వీటికి ఆమోదం లభించే అవకాశం ఉందంటున్నారు. కొన్ని రోజుల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జినోమ్ వ్యాలీలో పర్యటిం చారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసినందుకు.. ఇక్కడ టెక్నికల్ ఉద్యోగాలకు అవకాశాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అందుకే ఈ ప్రాంతంలో త్వరలోనే ఒక ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. దాని ప్రకారమే అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు రెడీ చేశారు. జినోమ్ వ్యాలీతో పాటు మరో మూడు ప్రాంతాల్లో కూడా ఐటీఐ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

కొండాపూర్, జీనోమ్ వ్యాలీ, మధిర, చెన్నూరు ప్రాంతాల్లో ఐటీఐలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని.. కనుక వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే ఇక్కడ ఐటీఐలు ప్రారంభించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐలలో 98 శాతం అడ్మిషన్లు పూర్తి అయ్యాయి. దీంతో రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఐటీఐల అవసరం ఉంది అనే దానిపై సర్కార్.. ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. వీటికి తగ్గట్టుగా రాష్ట్రంలో మరో నాలుగు ఐటీఐ కాలేజీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయనుం ది. ఒక్కో పాఠశాలకు రూ. 200 కోట్ల చొప్పున కేటాయిస్తుంది. ప్రస్తుతం మొత్తం 78 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటితో పాటుగా రేవంత్ సర్కార్ తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభించనుంది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నాగర్ కర్నూలు, రంగా రెడ్డి జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయనుంది. వీటిలో టిఫిన్, మధ్యాహ్నం భోజనం, ట్రాన్స్‌పోర్ట్ అన్నీ ఉచితంగా అందించనున్నారు. ఒక్కో పాఠశాల కోసం ప్రభుత్వం 12 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది. త్వరలోనే వీటిని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించేందుకు సిద్ధం అవుతోంది.

## ఆహారంలో పురుగు మందులను గుర్తింవచ్చు

తెలంగాణ: నేటి కాలంలో మనం తినే ఆహారం, పీల్చే గాలి, తాగే నీరు ఇలా ప్రతిదీ కలుషితం అవుతూనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా మనం తినే ఆహారం ఎంత విషతుల్యంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పంట దిగుబడిని పెంచడం మొదలు.. త్వరగా కాపు, పక్వానికి తీసుకురావడం కోసం పలు రకాల రసాయనాలను వాడుతున్నాము. ఫలితంగా మనం తినే ఆహారంలో పురుగు మందు అవశేషాలు విపరీతంగా పెరుగుతున్నాయి. అయితే సాధారణంగా పరీక్షించడం ద్వారా మనం ఈ పురుగు మందులను గుర్తించలేము. దీంతో మనకు తెలియకుండానే విష రసాయనాలను తింటున్నాము. అయితే ఈ సమస్యకు పరిష్కారం కనిపెట్టారు. ఆహారంలో పురుగు మందులను గుర్తించే పరికరాన్ని అభివృద్ధి చేశారు.

హైదరాబాద్‌కు చెందిన బిట్స్ (బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) పిలానీ ఈ పరికారాన్ని అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఆహారంలో పురుగు మందులను సులభంగా.. ఇంట్లోనే గుర్తించవచ్చు. దీనివల్ల మనం తినే ఆహారం సురక్షితమో కాదో తెలుసుకోవచ్చు. బిట్స్ పిలానీ వారు నార్వేలోని ది అర్కిటిక్ యూనివర్సిటీతో కలిసి దీన్ని అభివృద్ధి చేశారు. ఈ పరికరం పండ్లు, కూరగాయలపై ఉండే పురుగు మందుల అవశేషాలను వెంటనే గుర్తిస్తుంది. కెమిలుమినిసెన్స్ అనే ప్రక్రియ ద్వారా ఇది పనిచేస్తుంది. కెమిలుమినిసెన్స్ అంటే ఒక రసాయన చర్య ద్వారా కాంతిని ఉత్పత్తి చేయడం. దీని గురించి మైక్రోకెమికల్ జర్నల్‌లో ప్రచురితమైంది.

బిట్స్ పిలానీకి చెందిన సీనియర్ రీసెర్చ్ అసోసియేట్ పవర్ సాయి కుమార్ దీని గురించి మాట్లాడుతూ.. మేం అభివృద్ధి చేసిన ఈ పరికరం చాలా చిన్నగా.. చేతిలో ఇమిడిపోతుంది. ఇది కెమిలుమినిమీటర్‌గా పనిచేస్తుంది. పండు, కూరగాయలు కడిగిన నీటిని దీనిలో వేస్తే చాలు. ఆ నీరు రసాయనంతో చర్య జరిపి కాంతిని విడుదల చేస్తుంది. ఆ కాంతి పురుగు మందులు ఉన్నాయో లేవో సూచిస్తుంది. ఇది పోర్టబుల్ పరికరం కనుక దీన్ని ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. మార్కెట్‌కు వెళ్లి పళ్లు, కూరగాయలు కొనాలనుకుంటే.. ఈ పరికరాన్ని వెంట తీసుకు వెళ్లి చెక్ చేసి.. ఆ తర్వాత వాటిని కొనుగోలు చేయవచ్చు అని తెలిపారు. ఈ పరికరం ధర రూ. 5000 నుంచి రూ. 10,000 వరకు ఉంటుందన్నారు. ఈ పరికరంలో వెలువడే కాంతి తీవ్రతను బట్టి పురుగుల మందుల మోతాదును కొలవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. సాధారణంగా పురుగుల మందులను గుర్తించే పద్ధతులు చాలా కష్టంగా.. ఎక్కువ సమయం తీసుకునేవిగా.. ఖరీదైనవిగా ఉంటాయయి. అలానే వాటిని గుర్తించడానికి ప్రత్యేక ప్రయోగశాల, శిక్షణ పొందిన సాంకేతిక నిపుణులు అవసరం. అయితే కొత్తగా అభివృద్ధి చేసిన ఈ పరికరం ఆ సమస్యలను పరిష్కరిస్తుందని పరిశోధకులు తెలిపారు. దీన్ని ఉపయోగించడం చాలా సులభమే కాక..రిమోట్ ప్రాంతాలకు కూడా దీనిని తీసుకువెళ్లి పరీక్షలు చేయవచ్చని తెలిపారు.

ఈ పరికరం ఒక టెస్ట్ స్ట్రిప్(మైక్రోఫ్లూయిడిక్ పేపర్-బేస్డ్ అనలిటికల్ డివైస్)ను ఉపయోగిస్తుంది. ఇది ఒక ఫిల్టర్ పేపర్‌లాంటిది అన్న మాట. దీనిపై ఒక రసాయనం ఉంటుంది. ఈ పోర్టబుల్ సిస్టమ్‌లో ఒక హై-రిజల్యూషన్ కెమెరా, ఇంటిగ్రేటెడ్ మైక్రోకంట్రోలర్ ఉంటాయి. ఇవి ఫలితాన్ని విశ్లేషించి, ఎంత మోతాదులో పురుగుల మందు ఉందో తెలుపుతాయి. అలానే ఈ పరికరాన్ని ఉపయోగించి నూనెలు, చిరుధాన్యాలతో సహా అనేక పదార్థాలను పరీక్షించవచ్చు అని తెలిపారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు బంపరాఫర్.. ఫ్రీగా రూ.25 వేలు ..



తెలంగాణ: ఆర్టీసీ ప్రయాణికులకు ఇది నిజంగా బంపరాఫరే. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు రూ. 25 వేలు పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు అధికారులు. అయితే ఈ ఛాన్స్ రాష్ట్రంలోని ఆర్టీసీ ప్రయాణికులందరికీ వర్తించదు. కేవలం ఒక్క జిల్లా వాసులకు మాత్రమే ఈ బంపరాఫర్. ఇంతకు మరి ఈ ఆఫర్ ఏంటి.. ఏ జిల్లా వాసులకు వర్తిస్తుంది అంటే కరీంనగర్ ఆర్టీసీ ప్రయాణికుల కోసం ఆర్టీసీ యాజమాన్యం ఈ బంపరాఫర్ ప్రకటించింది. ఈ నెల అనగా సెప్టెంబర్ 27 నుంచి వచ్చే నెల అంటే అక్టోబర్ 6 వరకు.. అన్ని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఇది వర్తించనుంది. ఇంతకు రూ.25 వేలు ఎలా ఉచితంగా పొందుతారంటే.. ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించే లక్కీ డ్రాలో గెలవడం ద్వారా.

కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని అన్ని రకాల బస్సులు అనగా.. సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, డీలక్స్, లహరి, రాజధాని బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కోసం లక్కీ డ్రా నిర్వహించబోతున్నట్లు ఆర్ఎం తెలిపారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6వరకు జిల్లా నుంచి.. పైన చెప్పిన అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారికి ఈ లక్కీ డ్రా స్కీమ్ వర్తిస్తుందని ఆర్ఎం తెలిపారు.

**సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, డీలక్స్, లహరి, రాజధాని బస్సుల్లో ప్రయాణి ంచే ప్రయాణికుల కోసం లక్కీ డ్రా నిర్వహించబోతున్నట్లు ఆర్ఎం తెలిపారు.**

ఈ ప్రైజ్ మనీ పొందాలంటే.. ప్రయాణికులు వారి గమ్యస్థానం అనగా వారు దిగాల్సిన స్టాప్ వచ్చాక.. వారు తీసుకున్న టికెట్ మీద సదరు ప్రయాణికుడి పేరు, అడ్రెస్, ఫోన్ నంబర్ రాసి.. దాన్నిఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రధాన బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్సుల్లో వేయాలని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. అక్టోబర్ ఆరు వరకు ప్రయాణికులు ఈ లక్కీ డ్రా స్కీమ్‌లో పాల్గొనవచ్చు.

ఆ తర్వాత రెండు రోజులకు అనగా అక్టోబర్ 8న డ్రా తీస్తారు. ఇక దీనిలో మొదటి బహుమతి గెలిచిన వారికి రూ.25 వేలు ఇస్తారు. అలానే సెకండ్ ప్రైజ్ పొందిన వారికి 15 వేల రూపాయలు.. థర్డ్ ప్రైజ్ వారికి 10 వేల రూపాయల చెక్కు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ సిబ్బంది వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య భారీగానే ఉంటుంది. ప్రయాణికుల సంఖ్యను మరింత పెంచుకునేందుకు ఆర్టీసీ ఈ లక్కీ డ్రా స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఇదిలా ఉంటే తాజాగా ఆర్టీసీ మహిళలకు కల్పిస్తోన్న ఉచిత ప్రయాణంపై కీలక అలర్ట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పథకం రూల్స్ ప్రకారం మహిళా ప్రయాణికులు తెలంగాణ అడ్రెస్ ఉన్న ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ఓటరు ఐడీ వంటి గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తే.. వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తిస్తుంది. అయితే కొందరు కండక్టర్లు కేవలం ఆధార్ కార్డు మాత్రమే చెల్లుబాటు అవుతుందని చెబుతూ.. ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ సమస్యపై 040-69440000 నంబర్‌కు లేదా స్థానిక డిపో మేనేజర్లకు కంప్లైంట్ చేయవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## ఘనంగా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు.





- జిల్లా శాఖ కార్యవర్గం ఏకగ్రీవం.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 24 :

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. బుధవారం నిజామాబాద్ రెవెన్యూ భవన్ లో ఈ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర సంఘం నుండి ఎన్నికల అధికారులుగా విచ్చేసిన నారాయణ రెడ్డి, నిరంజన్ రావు ల సమక్షంలో జిల్లా శాఖకు ఎన్నికలు నిర్వహించగా, జిల్లాలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, కలెక్టర్ కార్యాలయం డివిజన్ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు, తహసిల్దార్లు పాల్గొని జిల్లా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని స్థానాలకు ఒక్కోటి చొప్పున మాత్రమే నామినేషన్లు రావడంతో కార్యవర్గం మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

## కుక్కగోరు గుచ్చుకొని యువకుడు మృతి..

భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. పెంపుడు కుక్క గోరు గుచ్చుకోవడంతో ఓ యువకుడు రేబిస్ లక్షణాలతో మరణించాడు. అనుకోని విధంగా గోరు గుచ్చుకో వటం.. ఆ తర్వాత గాయాన్ని నిర్లక్ష్యం చేయటంతో యువకుడి ప్రాణం పోయింది. కుక్క కాటు లేదా గోరు గుచ్చుకోవడం ద్వారా సంక్రమించే రేబిస్ లక్షణాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గత 25 ఏళ్లుగా పోలీసు శాఖలో సేవలంది స్తున్న మంజారియా అనే అధికారి ఐదు రోజుల క్రితం అకస్మాత్తుగా తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. అనుకోని విధంగా తన పెంపుడు కుక్క గోరు గుచ్చుకోవటంతో రేబిస్ వ్యాధి లక్షణా లతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా భద్రాద్రి కొత్తగూ డెం జిల్లాలోనూ ఇటువంటి విషాదకర ఘటనే చోటు చేసుకుంది. పెంపుడు కుక్క గోరు గుచ్చుకోవడం వల్ల ఒక యువకుడు రేబిస్ వ్యాధితో మరణించాడు. ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెంది న సందీప్ అనే పాతికేళ్ల యువకుడు రెండు నెలల క్రితం ఒక కుక్కపిల్లను ఇంటికి తీసుకొచ్చా డు. అయితే దానిని మచ్చిక చేసుకునే క్రమంలో సందీప్ తండ్రిని కుక్క కరిచింది.

అదే సమయంలో అక్కడే ఉన్న సందీప్ చేతికి కుక్క కాలి గోరు గుచ్చుకుంది. తండ్రికి వెంటనే చికిత్స చేయించిన సందీప్.. తన గాయాన్ని చిన్నదే కదా అని నిర్లక్ష్యం చేశాడు. గోరు గుచ్చుకున్న గాయం మానిపోయినా.. కొన్ని రోజుల తర్వాత సందీప్‌లో రేబిస్ లక్షణాలు కనిపిం చడం మొదలయ్యాయి. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, బలహీనత, అయోమయం వంటి లక్షణాలతో బాధ పడుతూ ఆస్పత్రిలో చేరా డు. దురదృష్టవ శాత్తు.. సోమవారం నాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో అతడి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.



## కొనసాగుతున్న "శ్రీ వారాహి దేవి" నవరాత్రి ఉత్సవాలు.

వేగుచుక్క న్యూస్:నిజామాబాద్

పట్టణంలోని అమ్మవెంచర్‌లోని శ్రీ వారాహి దేవి క్షేత్రంలో నవరాత్రుల ఉత్సవాలు ఆధ్యాత్మికతతో వైభవంగా జరుపుకుంటున్నారు. నవరాత్రుల మూడవ రోజైన బుధవారం సాయంత్రం 6:30 నుండి 7:30 వరకు ప్రత్యేక అభిషేకం, పుష్పార్చన, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ వారాహి అమ్మవారి దర్శనం పొందారు.

ఆలయ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ మాట్లాడుతూ, నవరాత్రి వేడుకలు భక్తులకు పవిత్రమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయని, భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చి అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని కోరారు. ఆయన పేర్కొన్నారు, ఈ నవరాత్రులలో ప్రతి రోజు అభిషేకం మరియు పూలాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.






## సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు..

తెలంగాణ: పట్టణాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న వీధి వ్యాపారులకు ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మున్సిపల్ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో "లోక్ కల్యాణ్ మేళా" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ మేళా ద్వారా ఆర్థిక సాయం, సామాజిక భద్రతతో పాటు రుణ సౌకర్యాలను అందించి వ్యాపారస్తులకు నూతన అవకాశాలను కల్పించడం ప్రధాన ఉద్దేశంగా ఉంది. అసిఫాబాద్ జిల్లాలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

కూరగాయలు, పండ్లు, బజ్జీలు, కొబ్బరి బోండాలు అమ్ముకునే తోపుడు బండ్ల వ్యాపారులు మాత్రమే కాకుండా ప్రధాన రహదారుల వద్ద దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే వారినీ ఈ పథకంలో చేర్చుతున్నారు. పీఎం స్వనిధి పథకం కింద కొత్త దరఖాస్తులను స్వీకరించి.. బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు. అంతేకాక, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఆహార విక్రేతలకు నాణ్యతపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు కూడా మేళాలో భాగంగా ఉంటాయి. ఇప్పటివరకు కాగజ్‌నగర్‌లో 3,125 మంది రుణాలకు దరఖాస్తు చేసుకోగా.. 2,900 మందికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. తాజాగా 100 మంది కొత్త వ్యాపారులను గుర్తించి, వారిలో 25 మందికి రుణాలు అందించే దిశగా చర్యలు ప్రారంభించారు. బ్యాంకులు తిరస్కరించిన 66 దరఖాస్తులు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించిన 31 కేసులు, సామాజిక భద్రతపై చర్చించిన 39 కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

మూడు విడతలుగా రుణం మంజూరు..

రుణ పరిమితిని మూడు విడతలుగా పెంచుతూ రూ.15,000, రూ.25,000, రూ.50,000 వరకు మంజూరు చేయనున్నారు. అంతక ముందు ఈ లోన్ విలువ రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.30 వేలుగా ఉండేది. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక శిక్షణా శిబిరాలు కూడా నిర్వహించనున్నారు. కల్తీ లేని ఆహార పదార్థాల వినియోగం, నాణ్యత ప్రమాణాలు పాటించడం, లైసెన్సుల జారీ వంటి అంశాలపై విక్రేతలకు అవగాహన కల్పిస్తారు. బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ అగ్రిగేటర్లు, టౌన్ వెండింగ్ కమిటీలు, ఎన్‌జీఓలు, విక్రేత సంఘాలు ఈ ప్రచారంలో భాగమవుతాయి. రుణాల కోసం తప్పనిసరిగా సిబిల్ స్కోర్ అవసరం అని.. పత్రాలను పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే ఆర్థిక సాయం అందజేస్తామని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ జాడి మోతీరాం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం వీధి వ్యాపారులకు ఆర్థికంగా బలాన్నిచ్చి, సామాజిక భద్రతను అందించే దిశగా ముందడుగు వేస్తోంది.

## త్వరలోనే 5 ఎకరాల్లో 7 కోర్టులకు బిల్డింగ్‌లు

తెలంగాణ: సుమారు 52 ఏళ్ల పాత భవనానికి ఇప్పుడు మోక్షం లభించబోతుంది. అదే రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కోర్టు బిల్డింగ్. సుమారు 5.01 ఎకరాల విస్తీర్ణంలో.. రూ.81.26 కోట్ల వ్యయంతో మత్తంగా 7 కోర్టులు భవనాలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెడీ అయ్యింది. ఇప్పటికే ప్రభుత్వం ఈ భవనాల నిర్మాణం కోసం కావాల్సిన రూ.81.26 కోట్ల నిధులను విడుదల చేసింది. సెప్టెంబర్ 27న కొత్త కోర్టు భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 52 సంవత్సరాల క్రితం అనగా 1973లో కట్టిన భవనాల్లోనే కోర్టును నిర్వహిస్తున్నారు. అయితే ఈ బిల్డింగ్ ప్రస్తుతం అవసరాలకు సరిపోకపోవడంతో..కొత్త భవనాలను నిర్మించనున్నారు.

52 సంవత్సరాల క్రితం అనగా 1973లో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తాత్కాలిక బిల్డింగ్‌లో.. మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగేళ్లకు అనగా 1977లో పక్కా భవనం నిర్మించారు. ఆ ఏడాది నుంచి కోర్టు కార్యకలాపాలు ఈ భవనం నుంచే కొనసాగుతున్నాయి. అయితే జనాభా పెరగడంతో.. ఈ బిల్డింగ్‌లోని వసతులు ప్రస్తుతానికి సరిపోవడం లేదు. దీంతో కోర్టుల కోసం కొత్త భవనాలను నిర్మించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో వినిపిస్తుంది. అయితే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందిస్తూ.. కొత్త కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేసింది. జిల్లా కేంద్రంలో కోర్టు సముదాయాన్ని నిర్మించడానికి అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న పాత భవనం స్థానంలోనే కొత్త బిల్డింగులను నిర్మించనున్నారు. అయితే ఈ కొత్త భవనాలు నిర్మించేదాకా.. కోర్టులను అద్దె భవనాల్లోకి తరలించనున్నారు. త్వరలోనే నిర్మించబోయే కొత్త బిల్డింగ్‌లను జీ ప్లస్ 4 పద్ధతిలో నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రెడీ చేశారు. కొత్త బిల్డింగుల నిర్మాణంలో భాగంగా ఏడు కోర్టులకు భవనాలు, ప్రతి దానికి కోర్టు హాల్స్ నిర్మించనున్నారు. ఏడు కోర్టుల్లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొదలు డిస్ట్రిక్ట్ కోర్టులకు బిల్డింగ్‌లు నిర్మించనున్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యింది. సెప్టెంబర్ 27న శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 52 ఏళ్ల తర్వాత కొత్త బిల్డింగ్ నిర్మాణ పనులు మొదలు కావడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని అత్యాధునిక హంగులతో ఈ బిల్డింగులను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది నాటికి వీటి నిర్మాణం పూర్తి చేసి.. కోర్టు కార్యక్రమాలను ఈ కొత్త బిల్డింగుల్లోనే ప్రారంభించాలని భావిస్తున్నారు.